సాక్షి
మెదక్
శనివారం, 16, నవంబర్, 2024



ఏడుపాయలలో కార్తీక శోభ



చేగుంట(తూప్రాన్): మహంకాళి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మెదక్ కోదండ రామాలయంలో..

కార్తీక కాంతులు

జిల్లావ్యాప్తంగా శుక్రవారం కార్తీక శోభ వెల్లివెరిసింది. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఏడుపాయలలో లక్ష దీపార్చన.. పల్లకీ సేవ నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్ దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ చంద్రశేఖర్ ఆలయ సిబ్బంది అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అఖండ దీపాన్ని వెలిగించారు. మంజీరా పాయల్లో కార్తీక దీపం వదిలారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి పల్లకీ సేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు ప్రమిదలు వెలిగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – పాపన్నపేట(మెదక్)

న్యూస్‌రీల్

దుర్గమ్మ సన్నిధిలో ఎస్పీ దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి దంపతులు

పాపన్నపేట(మెదక్): ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి దంపతులు శుక్రవారం ఏడుపాయల వనదుర్గమ్మను దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికారు. అమ్మవారికి అర్చన, అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ సిబ్బంది వారిని సత్కరించారు. వారి వెంట పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

రైతులకు పోలీస్‌శాఖ సహకారం: ఎస్పీ

కొల్చారం(నర్సాపూర్): ధాన్యం కొనుగోళ్లలో తలెత్తే ఇబ్బందులను పరిష్కరించేందుకు పోలీస్‌శాఖ పూర్తి సహకారం అందిస్తుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు రహదారులపై కాకుండా కల్లాల వద్ద ధాన్యాన్ని ఆరబోయడంపై అభినందించారు. వడ్ల రవాణాలో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతులతో మాట్లాడారు. సన్నరకం ధాన్యం కొనుగోళ్లపై ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సివిల్ సప్లై అధికారులతో మాట్లాడి త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు, రవాణా జరిగేలా చూస్తానని చెప్పారు. ఎస్పీ వెంట మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ తదితరులు ఉన్నారు.

ఆ రూట్‌లో బస్సులు పెంచండి



ప్రయాణికుల సమస్యలు తెలుసుకుంటున్న డీఎం సురేఖ

మెదక్ మున్సిపాలిటీ: బొడ్మట్‌పల్లి రూట్‌లో బస్సులు సరిపోవడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు మెదక్ ఆర్టీసీ ఎండీని కోరారు. శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించగా, జిల్లా నలుమూలల నుంచి ప్రయాణికులు అడిగిన ప్రశ్నలకు డీఎం సురేఖ సమాధానాలు ఇచ్చారు. ముఖ్యంగా బొడ్మట్‌పల్లి రూట్‌లో బస్సుల ట్రిప్పులు పెంచాలని, నర్సాపూర్ రూట్‌లో ఉదయం 4.30 గంటలకు ఒక బస్సు పెట్టాలని, మెదక్- శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు ఒక బస్సు సర్వీస్ వేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఎం వారికి హామీ ఇచ్చారు.

బీసీలు తీవ్రంగా నష్టపోయారు



సమావేశంలో మాట్లాడుతున్న గంగారాం

రామాయంపేట(మెదక్): ఇన్నాళ్లు కులగణన చేపట్టకపోవడంతో బీసీలు అన్నిరంగాల్లో తీవ్ర అన్యాయానికి గురయ్యారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం అన్నారు. శుక్రవారం రామాయంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం కులగణన విషయమై పట్టించుకోలేదన్నారు. బీసీల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమని అన్నారు. ఈనెల 19వ తేదీన జిల్లా కేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని, ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీసీ సంఘాల ప్రతినిధులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో జిల్లా క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు గణేశ్, నియోజవర్గ ఇన్‌చార్జి సిద్ధరాంలు, రామాయంపేట పట్టణ అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షుడు రాము, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అవన్నీ అప్పు చేసే కొన్నాం!

ఆస్తుల వివరాలు వెల్లడించేందుకు నిరాకరణ

- ఎదురు ప్రశ్నిస్తున్న ప్రజలు
- తలలు పట్టుకుంటున్న ఎన్యుమరేటర్లు
- జిల్లాలో 39.12 శాతం సర్వే పూర్తి



మెదక్‌జోన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతోంది. అయితే ఆస్తుల వివరాలు వెల్లడించేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారు. అప్పుల గురించి అడిగితే.. ఎందుకు..? ప్రభుత్వం కడుతుందా.. అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు ఇచ్చే సమాధానాలతో ఎన్యుమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. సర్వే ఫాంలోని కొశ్చన్ నంబర్ (43) ఏ, బీ, సీ, డీలో స్థిరాస్తులకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఇళ్లు, ప్లాట్లు, వాణిజ్య వ్యాపారం, వాహనాలు, బైక్, కారు, ఆటో, ట్యాక్సీ, స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్, సొంత ఇల్లు, ఎయిర్ కూలర్ (ఏసీ) తదితర ప్రశ్నలు ఉన్నాయి. వాటి గురించి ఎన్యుమరేటర్లు ప్రశ్నించడంతో అప్పులు చేసి వాహనాలు, ప్లాట్లు కొనుగోలు చేశామని ప్రజలు చెబుతున్నారు. బ్యాంకులు, మహిళా సంఘాలతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పుల వివరాలను ప్రస్తావిస్తున్నట్లు తెలిసింది.

సర్వే చేయాల్సింది 60.88 శాతం

జిల్లావ్యాప్తంగా మొత్తం 2,18,361 ఇళ్లు ఉన్నట్లు గుర్తించి, ఈనెల 9 నుంచి సమగ్ర సర్వే చేపడుతున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 85,416 ఇళ్లు పూర్తి చేశారు. ఈ లెక్కన 39.12 శాతం సర్వే పూర్తి చేశారు. ఇంకా 60.88 శాతం పూర్తి చేయాల్సి ఉంది. 16 వేల మంది ఎన్యుమరేటర్లు, 170 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారు. ఇందులో ఒక్కో ఎన్యుమరేటర్‌కు 160 నుంచి 170 ఇళ్లను అధికారులు కేటాయించారు. కాగా ఒక్కో ఇంటి వద్ద 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతోంది. 75 ప్రశ్నలకు సమాధానం సేకరిస్తున్నారు. కాగా ఈనెల 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కాగా 10 రోజుల్లో పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఎన్యూమరేటర్లను ఆదేశించారు. అయితే ఇప్పటికే వారం రోజులు పూర్తి కాగా, 60 శాతానికి పైగా సర్వే చేయాల్సి ఉంది. సర్వే గడువును ఈనెలాఖరు వరకు పొడిగించే అవకాశం ఉందని సంబంధిత ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

త్వరలో వివరాల నమోదు

సమగ్ర కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం నూతన ఫార్మాట్‌ను డిజైన్ చేసింది. అది ఒకటి, రెండు రోజుల్లో అందుబాటులోకి రానుంది. అందులోనే పూర్తి వివరాలను నమోదు చేయనున్నారు. అయితే సర్వే పూర్తి అయిన తర్వాత నమోదు చేస్తారా..? లేక ఎప్పటికప్పుడు ఆపరేటర్లతో నమోదు చేయిస్తారా..? అనేది తెలియాల్సి ఉంది.

అంధత్వాన్ని జయించి.. | ఐదు ఉద్యోగాలు



తల్లిదండ్రులతో యాదగిరి

టేక్మాల్(మెదక్): శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుందని నిరూపించాడు టేక్మాల్ మండలం ఎల్లంపల్లికి చెందిన యాదగిరి. కంటి చూపులేకపోయినా పట్టుదలతో చదివి ఐదు ఉద్యోగాలు సాధించాడు. రాసే ప్రతీ పరీక్షలో ప్రతిభ చూపుతూ అందరి మన్ననలు పొందుతున్నాడు. గ్రామానికి చెందిన ఉప్పరి లలిత, రాములు దంపతులు కుమారుడు యాదగిరి అనారోగ్యంతో 2004లో చూపు కోల్పోయాడు. సాధించాలనే తపననే దృష్టిగా మరల్చుకొని పాఠశాల స్థాయిలోనే క్విజ్‌లో రెండుసార్లు, ఉపన్యాస పోటీలో రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యాడు. ఇంటర్ మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. చూపులేదని నిరుత్సాహపడకుండా ఆన్‌లైన్ క్లాసులు వింటూ 2022లో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం చేస్తూనే వీలైన సమయంలో చదువుకోవడంతో పాటు ఆన్‌లైన్ క్లాసులు వింటూ ఉండేవాడు. 2024లో డీఎస్సీలో ఎస్‌జీటీ, తెలుగు పండిత్, ఎస్‌ఏ సోషల్‌లో ఎంపికయ్యాడు. ప్రస్తుతం చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గురువారం విడుదలైన గ్రూప్- 4 ఫలితాల్లో మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. జీవితంలో ఏదైనా సాధించాలనే తపనతోనే పట్టుదలతో చదవడం మొదలు పెట్టానని... డిగ్రీ లెక్చరర్ కావడమే తన లక్ష్యమని యాదగిరి పేర్కొన్నాడు.

ట్యూషన్లు చెబుతూ..



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌కు చెందిన కనిగిరి మల్లేష్- లక్ష్మిల కుమారుడు ముఖేష్ గ్రూప్- 4లో ప్రతిభ చాటాడు. చిన్నప్పుడే తండ్రి మరణించడంతో తన తల్లి, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో చదువుకున్నాడు. 1 నుంచి 10వ తరగతి వరకు కాళ్లకల్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ముఖేష్, ఇంటర్, డిగ్రీ సైతం ప్రభుత్వ కాలేజీలో చదివాడు. ఓయూలో పీజీ సోషియాలజీ పూర్తి చేశాడు. తన అన్న గిరిబాబు ప్రభుత్వ ఉద్యోగి కావడంతో అతడిని స్ఫూర్తిగా తీసుకున్నాడు. 2019 నుంచి హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ఉంటూ హోం ట్యూషన్లు చెబుతూ ప్రిపరేషన్ కొనసాగించాడు. గ్రూప్- 4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ఇంకా గ్రూప్-2, 3కి సాధన చేస్తున్నట్లు తెలిపారు.



బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

గిరిజన తెగల అభివృద్ధికి చర్యలు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ కలెక్టరేట్: దేశంలోని గిరిజన తెగల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ధర్తి ఆబా జన గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ సంకల్ప పథకం నుంచి ప్రత్యేకంగా రూ. 79,156 కోట్లు కేటాయించిందని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం, గిరిజన బిడ్డల అభ్యున్నతి, ఆదివాసి హక్కుల కోసం పోరాడిన గొప్ప మహనీయుడు బిర్సా ముండా అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం చేపట్టిన పథకానికి జిల్లాలోని నర్సాపూర్, హవేళిఘణాపూర్, రామాయంపేట, కొడిపల్లి, పాపన్నపేట, టేక్మాల్, రేగోడ్, మాసాయిపేట, చిన్నశంకరంపేట మండలాలు ఎంపికైనట్లు వివరించారు. ఎంపిక చేసిన మండలాల్లో గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారిణి ఇందిర, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంటవెంటనే ధాన్యం తరలించాలి

హవేళిఘణాపూర్(మెదక్): కొనుగోలు చేసి న వెంటనే ధాన్యం రైస్ మిల్లులకు తరలించడంతో పాటు రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేలా చూడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కోంటూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. అనంతరం మెదక్ మండలం రాజ్‌పల్లిలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు.

పకడ్బందీగా గ్రూప్-3 పరీక్ష

మెదక్ కలెక్టరేట్: ఈనెల 17, 18 తేదీల్లో జిల్లాలో గ్రూప్–3 పరీక్షను పకడ్బందీగా నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు 5,867 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పా రు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తామని వివరించారు.

సంక్షేమ పథకాలు అందించేందుకే సర్వే

- ప్రతిపక్షాలవి తప్పుడు ప్రచారాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో కొనసాగుతున్న సమగ్ర సర్వేను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యుమరేటర్లతో మాట్లాడుతూ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 35 శాతం సర్వే పూర్తియిందన్నారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం సర్వేను తప్పుదోవ పట్టిస్తూ సోషల్ మీడియా ద్వారా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరలో రూ.2లక్షలపైగా ఉన్న రైతుకు కూడా రుణమాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ శ్రీరాములు, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, తదితర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సర్వే వివరాలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అవగాహన లేక.. సేవలు అందక..

ఆరేళ్లలో సిటిజన్ బడ్డీ యాప్‌కు 1,933 దరఖాస్తులు మాత్రమే



మెదక్ మున్సిపాలిటీ: స్మార్ట్‌ఫోన్ ద్వారా ఒక్క క్లిక్‌తో సమస్య చెప్పండి.. పరిష్కారం పొందండంటూ మున్సిపల్ శాఖ సిటిజన్ బడ్డీ యాప్ తీసుకొచ్చింది. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా.. ఇంటి నుంచే ఫిర్యాదు చేసి పరిష్కరించుకునేందుకు ప్రజలకు వెసులుబాటు కల్పించింది. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగకుండా చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే యాప్‌పై క్లిక్ చేస్తే చాలు సమస్య అధికారుల దృష్టికి చేరుతుంది. ప్రభుత్వం మున్సిపల్ శాఖ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు పౌర సేవలు అందించేందుకు ఆరేళ్ల క్రితం యాప్‌ను తీసుకొచ్చింది. అయితే అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ఇప్పటికీ ప్రజలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

అన్నీ యాప్‌లోనే...

మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈ యాప్‌ను ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది. యాప్‌లో మున్సిపల్ సమాచారంతో పాటు ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాల అధికారులు, సిబ్బంది జాబితా, కమిషనర్, కార్యాలయ ఫోన్ నంబర్లు ఉంటాయి. ఇక పన్నుల చెల్లింపులు, ఫిర్యాదులు, ఆన్‌లైన్ సేవలు, దరఖాస్తు పత్రాలు, ఇతర సేవలు అందుబాటులో ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన సేవలను ఉపయోగించుకోవచ్చు. పౌర సేవలు, సమాచారం ఇస్తూనే ఏ సమస్య ఉన్నా..యాప్ ద్వారా తెలియజేసేలా ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, అనధికార కట్టడాలు, ఉల్లంఘనల నివేదన, ఆదాయం, వీధి వ్యాపారుల సమస్య, ఆహార పరిశుభ్రత, భద్రత, ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చు. అంతేకాక యాప్‌లోనే సమస్యలను గడువులోపు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

రెండు వేల లోపే..

2018లో ప్రభుత్వం సిటిజన్ బడ్డీ యాప్‌ను రూపొందించినా.. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 2 వేల లోపే. ప్రజలకు అవగాహన లేకపోవడం.. ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తున్నారు. అసలు యాప్ ఉన్న విషయం చాలా మంది ప్రజలకు ఇప్పటికీ తెలియడం లేదు. ఎవరో ఒకరు యాప్ ద్వారా దరఖాస్తు చేస్తున్నారు. ఆరేళ్లలో 1,9,33 మాత్రమే రావడం ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు.

అవగాహన కల్పిస్తాం



ఇటీవల బదిలీపై కమిషనర్‌గా వచ్చాను. ప్రస్తుతం సమగ్ర, సామాజిక సర్వేలో ఉన్నాం. సర్వే పూర్తి కాగానే ప్రజలకు సిటిజన్ బడ్డీపై అవగాహన కార్యక్రమాలు చేపడుతాం.
– శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ కమిషనర్



రాముడొచ్చాడు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం లగచర్ల ఘటనలో అరెస్ట్ అయిన రైతులను పరామర్శించేందుకు కంది జిల్లా జైలుకు వచ్చారు. నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. కలిసేందుకు ఆసక్తి చూపారు. వారిని కట్టడి చేయడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. అప్పటికే బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కాన్వాయ్‌తో జైలు లోపలకు వెళ్లారు. కేటీఆర్ వెంట వచ్చిన నాయకులు జైలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. – కంది(సంగారెడ్డి)



క్లుప్తంగా

ఇంతియాజ్‌కు సేవారత్న అవార్డు



ఇంతియాజ్‌ను అవార్డు అందజేస్తున్న చైర్మన్ రమేశ్, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మీర్జా ఇంతియాజ్‌కు శుక్రవారం భారతీయ స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఎన్జీవో హానర్ సంస్థ ఆధ్వర్యంలో సేవారత్న నేషనల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేశ్ హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో గల కళాభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంతియాజ్‌ను సన్మానించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ.. తాను చేసిన సేవలను గుర్తించిన స్ఫూర్తి సొసైటీ సర్వీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

కథల పోటీల్లో పురస్కారం



బహుమతి అందుకుంటున్న అర్పిత

హవేళీఘణాపూర్(మెదక్): బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ కోదూరు శాంతమ్మ స్మారక కథల పోటీల్లో మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని అర్పిత తెలుగు కథల పోటీల్లో రాష్ట్రస్థాయి ఉత్తమ కథగా నగదు బహుమతిని, పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులు కేవీ రమణ, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, వరప్రసాదరెడ్డి, గరిపల్లి అశోక్, జుర్రు చెన్నయ్య చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ హర్షం వ్యక్తం చేశారు.

బేస్ బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, పీడీ సతీష్

సిద్దిపేటరూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 68వ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ నారాయణరావుపేట విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డేపల్లి నాగరాజు, పీడీ తోట సతీష్ శుక్రవారం తెలిపారు. అండర్ 17 విభాగంలో అభిరామ్ , నవనీత్, అండర్ 14 విభాగంలో దినేష్ రెడ్డి, వినయ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు 16 ,17, 18 తేదీల్లో నిర్మల్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి మామిండ్ల గౌరీ మోహన్, ఎస్జీఎఫ్ సెక్రటరీ సౌందర్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కుక్కల దాడిలో 16 మేకలు మృత్యువాత



కంగ్టి(నారాయణఖేడ్): వీధి కుక్కల దాడిలో మేకలు మృతి చెందిన ఘటన కంగ్టి మండలం దేగుల్‌వాడిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఉప్పరి గణపతి, రాంచందర్ రోజులాగే మేకలను ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కొట్టంలోకి పంపించారు. వీధి కుక్కల గుంపు ఒక్కసారిగా మేకలపై దాడి చేయడంతో 16 జీవాలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

నాన్న ఫ్రెండ్ సలహాతోనే..

అగ్రికల్చర్ వైపు అడుగులు వేశా

- డాక్టర్ కావాలనుకున్నా సీటు రాలేదు
- 1983లో రిసెర్చ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం
- 2019లో ఉద్యోగ విరమణ
- వాతావరణ మార్పులపై రైతులకు సలహాలు, సూచనలు
- 130 రిసెర్చ్ పేపర్‌లు పబ్లిష్
- 'సాక్షి'తో ఉద్యాన యూనివర్సిటీ వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి



పంటలను పరిశీలిస్తున్న రాజిరెడ్డి



సాక్షి, సిద్దిపేట : మా నాన్న స్నేహితుడు ఒకరు రైల్‌లో కలిసినప్పుడు మీ అబ్బాయిని అగ్రికల్చర్ చేయించు అని సలహా ఇచ్చారు. ఆయన సలహా, సూచనలతోనే అగ్రికల్చర్ బీఎస్సీ వైపు అడుగులు వేశాను.. అప్పటి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ.. ఇప్పుడు విశ్వవిద్యాలయం ఉపకులపతి స్థాయికి ఎదిగానంటున్నారు డాక్టర్ దండ రాజిరెడ్డి. ఇప్పటి వరకు 130 వరకు రిసెర్చ్ పేపర్‌లు పబ్లిష్ అయ్యాయి. ఉద్యాన రైతుల అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇటీవల సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆయన్ను ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో వీసీగా ఎదిగిన తీరును 'సాక్షి'తో పంచుకున్నారు.

డాక్టర్ చదవాలనుకున్నా

మా గ్రామంలో 8వ తరగతి వరకే ప్రభుత్వ పాఠశాల ఉంది. దీంతో మెరుగైన విద్య కోసం హన్మకొండలో చదువుకునేందుకు మా నాన్న పంపించారు. అక్కడే 9వ తరగతి మల్టీపర్పస్ ప్రభుత్వ పాఠశాలలో, 10వ తరగతి మర్కజీ ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ చదివాను. డాక్టర్ చదువాలనుకున్నా మెడిసిన్‌లో సీటు రాలేదు. దీంతో మహారాష్ట్రలో అగ్రికల్చర్ బీఎస్సీ, ఎమ్మెస్సీ (వ్యవసాయశాస్త్రం) పూర్తి చేశాను. చదువు పూర్తి కాగానే ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో రిసెర్చ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ 1983 సంవత్సరంలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే వ్యవసాయ వాతావరణ శాస్త్రంలో పీహెచ్‌డీని గుజరాత్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో చేశాను. 1993 వరకు నాన్నతో కలిసి వ్యవసాయం చేశాను.

ట్రైన్‌లో చెప్పిన ఆ మాటలే..

నాకు డాక్టర్ కావాలని ఉండేది.. ఎంబీబీఎస్ సీటు రాలేదు.. ఒక రోజు నాన్న ట్రైన్‌లో ప్రయాణం చేస్తుండగా... నాన్నకు తన ఫ్రెండ్ కలిశారు. పిల్లలు ఏమి చదువుతున్నారు.. కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్న క్రమంలో నా గురించి నాన్న ఆయన ఫ్రెండ్‌కు చెప్పారు. అగ్రికల్చర్ బీఎస్సీ చేపించండి అని సలహా ఇచ్చారు. దీంతో నాన్న అగ్రికల్చర్ బీఎస్సీ ఎక్కడ ఉందో తెలుసుకున్నాడు. మహారాష్ట్రలో ఉందని తెలిసి అన్ని వివరాలు కనుక్కొని నన్ను అగ్రికల్చర్ బీఎస్సీలో జాయిన్ చేపించారు. ఆ రోజు మా నాన్నకు ఆ అంకుల్ కలవకపోతే సాధారణంగా బీఎస్సీ మాత్రమే చేసేవాడిని.. ఆ అంకుల్ చెప్పడంతోనే అగ్రికల్చర్ విద్య వైపు వచ్చాను. ఇప్పుడు రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నా.

రైతు మేళాలు నిర్వహిస్తా

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉంటుంది. పండ్లు, కాయగూరలు, పువ్వులు, సుగంధ ద్రవ్యాలు, పోస్ట్ హార్వెస్టింగ్ పై ఎక్కువగా ఫోకస్ పెడతాం. ఉద్యాన పంటలు సాగు చేసే రైతుకి, వినియోగదారుడికి ధరలో వ్యత్యాసం ఉంటుంది, ఆ ధరల్లో ఎందుకు వ్యత్యాసం ఉందని తెలుసుకొని ఏ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉంటుందో అక్కడ విక్రయించుకుంటే లాభం వస్తుంది. అలాగే ఉద్యాన పంట ఉత్పత్తులకు జియో ట్యాగ్ వచ్చే విధంగా కృషి చేస్తాను. రైతు మేళాలు నిర్వహిస్తా, రైతులకు సాగులో నూతన టెక్నాలజీ అందించే విధంగా ముందుకు సాగుతాం.

టీవీల ద్వారా రైతులకు సూచనలు, సలహాలు



1998 నుంచి 2013 వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో పని చేస్తూ వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల పై రైతులకు అవగాహన సదస్సులు ద్వారా పలు సూచనలు, సలహాలు ఇచ్చాను. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో టీవీల ద్వారా రైతులు అడిగి ప్రశ్నలకు సూచనలు చేశాను. 2014లో జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్, 2017లో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ విధులు నిర్వర్తిస్తూ అక్టోబర్, 2019 ఉద్యోగ విరమణ పొందాను. రెండేళ్ల పాటు వరల్డ్ బ్యాంక్ తరపున ఆఫ్ఘనిస్తాన్‌కు వాతావరణ మార్పుల సలహాలు ఇచ్చాను. నా అనుభవాన్ని చూసి ప్రభుత్వం ఉప కులపతిగా నియమించింది.

కుటుంబ నేపథ్యం

మాది పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కునారం గ్రామం. దండ రాంరెడ్డి–సుభద్రలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. నాన్న ప్రభుత్వ టీచర్‌గా పని చేసేవారు.. అయినప్పటికీ వ్యవసాయం చేసేవారు. నాకు 1982లో సూర్యకుమారితో వివాహమైంది. ఇద్దరు కుమారులున్నారు.

విరాళం పేరుతో నయా మోసం

- గుర్తు తెలియని వ్యక్తులు రైతుకు టోకరా
- రూ.5 వేలు తీసుకొని ఉడాయింపు



రసీదు చూపుతున్న దుర్గారెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): గుర్తు తెలియని వ్యక్తులు విరాళం పేరుతో నయా మోసానికి తెరలేపారు. అన్నదాన సత్ర నిర్మాణానికి విరాళం ఇవ్వాలంటూ ఓ రైతుకు మాయ మాటలు చెప్పి విరాళంతో ఉడాయించారు. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మారంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తీపిరెడ్డి దుర్గారెడ్డి ఇంట్లో ఉన్న సమయంలో ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి శ్రీశైలం ఆలయంలో అన్నదానం, సత్రం నిర్మాణానికి గ్రామంలో ఒక్కొక్కరి వద్ద సుమారు రూ. 20 వేల వరకు విరాళాలు సేకరిస్తున్నామంటూ పరిచయం చేసుకున్నారు. తనకు అంత స్థోమత లేదని రూ.500 విరాళం ఇస్తానని చెప్పాడు. గ్రామంలో చాలా మంది ఇచ్చారు మీరు కూడా ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేది లేక బాధితుడు వరి కోత కోసం తెచ్చి పెట్టుకున్న డబ్బుల్లో రూ.5 వేలు ఇచ్చాడు. అనంతరం గ్రామంలో ఎవరైనా విరాళం ఇచ్చారా అని ఆరా తీయగా.. విరాళాల పేరుతో గ్రామంలోకి ఎవరూ రాలేదని తోటి గ్రామస్తులు తేల్చి చెప్పడంతో బాధితుడు ఒక్కసారిగా కంగుతిన్నాడు. దుర్గారెడ్డికి అనుమానం రావడంతో వారు ఇచ్చిన రసీదులోని నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గ్రామస్తులతో కలిసి మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

ప్రాణాలు తీసిన రాంగ్ రూట్

కారు, మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడు మృతి

నారాయణఖేడ్: రాంగ్ రూట్ ప్రయాణం ఓ యువకుడి ప్రాణాలు బలి తీసుకుంది. కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల కేంద్రం సమీపంలో కేఎస్‌ఆర్ కార్యాలయం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా బోధన్ రక్కసిపేటకు చెందిన గోపికుమార్(30) మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఎక్సైజ్ ఎస్ఐగా పని చేస్తున్న విజయ్ కారులో జోగిపేట నుంచి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనగా గోపికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాంగ్‌రూట్‌లో వచ్చి తన కారును ఢీకొట్టి మృతి చెందాడని విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన గజం కిషన్(60) బైక్‌పై చిన్నశంకరంపేట వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో చిన్నశంకరంపేట వైపు నుంచి సూరారం వైపు చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రమేశ్ బైక్ పై వస్తున్నాడు. మార్గమధ్యలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గ్రామస్తులు 108 అంబులెన్స్ ద్వారా మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కిషన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు.

లారీకి విద్యుత్ వైర్లు తగిలి ఆపరేటర్..

మనోహరాబాద్(తూప్రాన్): లారీకి విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం, గర్వ జిల్లాకు చెందిన జితేంద్ర ప్రజాపతి (23) నాలుగు నెలల కిందట హిటాచీ ఆపరేటర్‌గా పని చేయడానికి మండలంలోని కూచారం గ్రామానికి వచ్చాడు. గురువారం రాత్రి లారీపై హిటాచీని ఎక్కించి పోతారం మీదుగా శివ్వంపేట మండలానికి వెళ్తున్నారు. పోతారం గ్రామంలో కిందికి వేలాడుతున్న విద్యుత్‌వైర్లు హిటాచీకి తగిలాయి. దీంతో లారీని ఆపారు. విద్యుత్ వైర్లను తొలగించడానికి కిందికి దిగిన ఆపరేటర్ జితేంద్ర కింద బురదలో నిలబడి లారీని పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘనపై బంధువు ఉజ్జార్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమని తాజా మాజీ సర్పంచ్ మాధవరెడ్డి ఆరోపించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్ గౌడ్

అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్..

శంకర్‌పల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన శేఖర్ (40) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. తండ్రి బాలరాజు 12 ఏళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లగా.. తల్లి లక్ష్మి రెండేళ్ల కిందట మరణించింది. అన్న ఆంజనేయులు మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కార్పెంటర్ దుకాణం నిర్వహిస్తుండగా శేఖర్ అక్కడే పని చేసేవాడు. నాలుగు రోజుల కిందట తల్లి సంవత్సరీకం ఉందని పటాన్‌చెరులో ఉండే అక్క కల్పన ఇంటికొచ్చాడు. అక్కడ నుంచి శంకర్‌పల్లికి వచ్చి పట్టణ శివారులో శవమై తేలాడు. శుక్రవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం తాగి, బహిరంగ మలవిసర్జనకు వచ్చిన క్రమంలో ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొట్టిన ఎక్సెల్

అల్లాదుర్గం(మెదక్): ఆటోను టీవీఎస్ ఎక్సెల్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని భైరవ దిబ్బ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ రెడ్డి కథనం మేరకు.. పాపన్నపేట మండలం ముద్దాపూర్ గ్రామానికి చెందిన కూలీలు ఆటోలో రేగోడు మండలం ఇటిక్యాల గ్రామానికి వరి కోతలకు వచ్చారు. తిరిగి ఇటిక్యాల గ్రామం నుంచి ముద్దాపురం వెళ్తుండగా బహిరాన్ దిబ్బ శివారులోకి రాగానే ఎదురుగా ఎక్సెల్ వాహనం వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని సంగయ్య కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎక్సెల్ నడుపుతున్న పాండుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ భాగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త అదృశ్యం.. భార్య ఆత్మహత్య

పెళ్లైన నాలుగు నెలలకే విషాదం

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో భర్త అదృశ్యమవగా.. ఉరేసుకొని భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన భాను ఇదే మండలంలోని మాదారానికి చెందిన రేణుక(22)ను నాలుగు నెలల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. భాను పెయింటర్‌గా, రేణుక ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు మార్గంలో ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. వీరి ఇద్దరి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవ గురించి రేణుక 11న తల్లిగారికి, 14న ఉదయం మైలారంలోని అత్తగారికి చెప్పింది. అదే రాత్రి గజ్వేల్‌లో తాము అద్దెకున్న ఇంటికి వెళ్లింది. ఇంతలోనే భాను తాను చనిపోతున్నానంటూ సెల్‌ఫోన్‌లో వీడియో తీసి కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని చెప్పి అదృశ్యమయ్యాడు. భాను కుటుంబ సభ్యులు 14న అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రేణుక తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం గజ్వేల్‌కి వచ్చి చూడగా అప్పటికే ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. భానుతోపాటు అతడి తల్లిదండ్రులు తమ కూతురి చావుకు కారణమంటూ మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యాపారంలో నష్టం వచ్చిందని ఉరేసుకొని

రామాయంపేట(మెదక్): చేపల వ్యాపారంలో నష్టం రావడంతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన మల్లయ్య (48) చెరువులో చేపలు పట్టుకోవడానికి కాంట్రాక్టు తీసుకున్నాడు. ఇందులో నష్టం రావడంతో అప్పులు పెరిగిపోయాయి. ఈ బాధతో గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకొని కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీజేసీపీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి



సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్(జీజేసీపీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిద్దిపేట జిల్లా కోహెడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైద్రాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా గజ్వేల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా జగదేవ్‌పూర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, ప్రచారకార్యదర్శి నాగేందర్, అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గిరి రవి, ప్రధాన కార్యదర్శి ధరిపల్లి నగేశ్, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిషన్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ సత్యనారాయణరెడ్డి, కూచంగారి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

హక్కుల కోసం కొట్లాడే వారిని ఎన్నుకోవాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్



మాట్లాడుతున్న అశోక్ కుమార్

మెదక్‌జోన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పెట్టుబడుదారులొస్తున్నారని, టీచర్లంతా అప్రమత్తంగా ఉండి హక్కుల కోసం కొట్లాడే అభ్యర్థులను ఎన్నుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గ టీచర్స్ అభ్యర్థిగా తనను రాష్ట్ర కమిటీ ప్రకటించిందన్నారు. శుక్రవారం పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో జరిగిన టీపీటీఎఫ్ జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధానాల అమలులో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటేనన్నారు. టీపీటీఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. తెలంగాణలో 4 శాతం మంది విద్యార్థులకు మాత్రమే నాణ్యమైన విద్య అందుతుందని, మిగితా విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య వెంకట్రామిరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు కాముని రమేశ్ పాల్గొన్నారు.

భూమి కబ్జాకు గురైంది.. న్యాయం చేయండి

మంత్రి పొన్నంకు బాధితుడి వినతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మా తాతల కాలం నుంచి వస్తున్న భూమిని కొంతమంది నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి కాజేశారని, నాకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సిద్దిపేట పట్టణంలో శుక్రవారం బాధితుడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణానికి చెందిన ఎక్కలదేవి లింగంకు ఓ సర్వే నంబర్‌లో 1.20 ఎకరాల సొంత భూమిని పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు కబ్జా చేశారని ఆరోపించారు. ఫోర్జరీ డాక్యుమెంట్‌లు తయారు చేసి, నా భూమిని కబ్జా చేశారని వాపోయాడు. ఇప్పటి వరకు కోర్టులను, అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా కొనుగోలు పత్రాలు సృష్టించారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పూర్తి విచారణ జరిపించి, నా భూమిని నాకు ఇప్పించాలని లింగం మంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం పూర్తి స్థాయిలో విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

నకిలీ పత్రాలతో భూమి ఆక్రమణ

ఉపాధి కోసం వెళ్తే కబ్జా చేశారని బాధితుడి ఆవేదన



మాట్లాడుతున్న మహేందర్ గౌడ్

దుబ్బాకటౌన్: వంశపారంపర్యంగా వస్తున్న భూమిని ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన బాధితుడు బత్తిని మహేందర్ గౌడ్ వేడుకున్నాడు. శుక్రవారం దుబ్బాకలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లచ్చపేటలో సర్వే నంబర్ 26లో కొంత భూమిని సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఆరోపిస్తూ, ఇటీవల గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించిన వ్యక్తికి ఆ భూమితో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ భూమి తమ కుటుంబానికి చెందిందన్నారు. 1953 నుంచి తమ తాత బత్తిని సీతయ్య పేరిట 11.23 ఎకరాలు రికార్డుల్లో ఉందన్నారు. ఉపాధి కోసం సీతయ్య కుమారులు ఇతర ప్రాంతాలకు వలస పోవడంతో, వారి భూమిని పలువురు కబ్జా చేశారని వాపోయాడు. గ్రామానికి చెందిన కొంత మంది అక్రమార్కులు, స్థానిక ప్రజా ప్రతినిధుల అండతో తప్పుడు పత్రాలు సృష్టించి, భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవలె 1,805 గజాల స్థలాన్ని రాజన్న సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఫోర్జరీ పత్రాలతో రికార్డులు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. తమ పూర్వీకులకు చెందిన భూమికి సంబంధించి కోర్టు కేసు ఉన్నందున ప్రజలు భూమిని కొనుగోలు చేసి ఇబ్బందులు పడొద్దని సూచించారు. భూమి వ్యవహారం కోర్టు పరిధి ఉండగా అమ్మడం, కొనడం చట్టవిరుద్ధమన్నారు.

తగ్గిన దిగుబడి.. పెరిగిన అప్పులు

భారీగా పడిపోయిన పత్తి ఉత్పత్తి

- క్వింటాల్‌కు రూ.6,700
- ధర పెరుగుతుందని ఇంట్లోనే నిల్వ
- ఆందోళనలో రైతులు



పెట్టుబడి కూడా రాని పరిస్థితి..

మునిపల్లి(అందోల్): వ్యాయ ప్రయాసాల కోర్చి ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. పంటచేతి కొచ్చిన సమయంలో తూఫాన్ రూపంలో వర్షాలు పడడంతో పంట దిగుబడి సగానికి పైగా తగ్గిపోయింది. అలాగే పత్తి తెంపడానికి కూలీల కొరత ఏర్పడింది. కిలోకి రూ.11 నుంచి రూ.12 వరకు ఇచ్చి కూలీలను పిలిపిస్తున్నారు. కూలీలు ఇంటి నుంచి గ్రామాలకు రాను పోను ఖర్చు, ఉండడానికి వారు వచ్చిన నుంచి పోయే దాక ఇతరాత్ర ఖర్చులన్నీ రైతులే భరిస్తున్నారు. కూలీలకు టార్పాలిన్లు, తినడానికి కలిపి మరో రూ.3 ఖర్చు అదనంగా అయ్యి మొత్తంగా కిలో రూ.15 లెక్కన రైతులపై భారం పడుతుంది. ఎకరాకు 3 నుంచి 6 క్వింటాళ్ల పత్తి రావడంతో పంట దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడి రావడమే కష్టంగా మారింది. పత్తి దిగుబడి సాధించాలనే లక్ష్యంతో రైతులు అన్ని రకాల ఎరువులు, పిచికారీ మందులు, సమయానికి కలుపుతీత పనులను నిర్వహించారు. పత్తి తెంపే సమయంలో క్వింటాల్‌కు బయట మార్కెట్‌లో దళారులు రూ.6,500 నుంచి రూ.6,900 వరకు కొనుగోలు చేస్తున్నారు. పాస్‌పుస్తకాలు ఉన్న రైతుల నుంచి సీసీఐ కేంద్రాల్లో పత్తి క్వింటాల్‌కు రూ.7 వేల నుంచి రూ.7,300 వరకు కొనుగోలు చేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. కానీ ఇంకా ధర పెరుగుతుందని కొంత మంది రైతులు పత్తిని ఇంట్లోనే నిల్వ ఉంచుతున్నారు.

ఎకరానికి రూ.20 వేల పైనే ఖర్చు



వర్షాలతో పంట దిగుబడి 70 శాతం తగ్గి పోయింది. పంట దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. ఒక వైపు దిగుబడి రాక.. మరోవైపు ధర లేకపోవడంతో నిరాశలో కొట్టు మిట్టాడుతున్నాం. విత్తనాలు, ఎరువులు, కలుపుతీత, పురుగు నివారణ మందు పిచికారీ, పత్తి పంట తెంపే కూలీల ఖర్చులతో ఎకరాకు రూ.20 వేలపైనే ఖర్చు అయ్యింది. –బోయిని శ్రీనివాస్, తాటిపల్లి